క్లుప్తంగా

మహిళల ఆర్థిక అవసరాలు-విస్తరిస్తున్న అవకాశాలు అంశంపై నేడు సదస్సు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): చిట్టినగర్‌లోని మోతి మసీద్ షాదీఖానాలో తమ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11.30 గంటలకు మహిళల ఆర్థిక అవసరాలు–విస్తరిస్తున్న అవకాశాలు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని తరుణీ తరంగాలు సంస్థ అధ్యక్షురాలు రావి శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్.వెంకట్రావు, జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రియల్ ప్రమోషనల్ ఆఫీసర్ ఎం.లావణ్య, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సుహాసిని ఈ సదస్సులో పాల్గొంటారని, ఆసక్తి ఉన్న మహిళలు పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.

వేడుకగా వినాయక చవితి మహోత్సవాలు



వించిపేట(విజయవాడపశ్చిమ):కొత్తపేటలోని జోడుబొమ్మ సెంటర్‌లోని శ్రీమహా గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక చవితి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం రెండు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ప్రముఖ వ్యాపారవేత్త చింతలపూడి సత్యనారాయణ, పవన్‌కుమార్ పాల్గొని విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చింతపూడి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీమహా గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాల నుంచి భక్తిశ్రద్ధలతో వినాయక మహోత్సవాలను నిర్వహించడం అభినందనీయం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీమహా గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు విద్యతోపాటుగా క్రీడల్లోనూ రాణించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయా క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి బుధవారం బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లోనూ విజయాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. జేఎన్‌టీయు ఆధ్వర్యంలో జరిగే అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు అద్భుతమైన విజయాలను సాధిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో సీఎస్‌ఈ, ఈసీఈ విభాగాలు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ తదితరులు ప్రసంగించారు. క్రీడా విభాగాధిపతి ఎం విక్టర్ జాన్సన్, క్రీడాకారులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

పరిటాల(కంచికచర్ల):ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో యూరియా నానో డీఏపీ, జీవన ఎరువులను వాడాలని గరికపాడు వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ సూచించారు. మండలంలోని పరిటాల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన ఎరువులు వినియోగిస్తే నేల సంరక్షణతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలని కోరారు. వ్యవసాయ అధికారుల సూచనలను రైతులు తప్పనిసరిగా పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర డీడీఏ వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

మక్కపేట(వత్సవాయి):గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మక్కపేటలోని మ్యారిసన్ జూనియర్ కళాశాల ఆవరణలో పుట్టగొడుగుల పెంపకంపై యువతకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు ఎం. రవికిషోర్, ఆర్.ప్రభావతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత స్వయం ఆర్థిక స్వావలంబనకు ఈ శిక్షణ దోహదపడుతుందని పేర్కొన్నారు. పుట్టగొడుగులు పెంపకంపై ఆసక్తి ఉన్న వారికి బ్యాంకులు రుణాలు కూడా అందిస్తున్నాయని, ఈ సదుపాయాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, గుంటూరు సామాజిక విజ్ఞాన కళాశాల(లాంఫాం) విద్యార్థులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో కలుషిత నీరే దిక్కు

- నిత్యం కలుషితమైన నీరే సరఫరా
- అవస్థలు పడుతున్న ప్రజలు
- నగరపాలకసంస్థ అధికారులకు ఫిర్యాదు
- అయినా పట్టించుకోని అధికారగణం



గొల్లపాలెంగట్టు ప్రాంతంలో సరఫరా అవుతున్న కలుషిత నీరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కొండ ప్రాంతాలకు నగరపాలకసంస్థ సరఫరా చేస్తున్న నీరు కలుషితంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాపై నగరపాకలసంస్థ అధికారులు చూపుతున్న అలసత్వం ప్రజల పాలిటశాపంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొండ ప్రాంతాల్లో మంచినీరు కలుషితమవుతోందని పలుమార్లు చెప్పినా కూడా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా కొండ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పట్టించుకునే అధికారులు కరువయ్యారంటూ స్థానిక నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తీవ్ర మంచినీటి సమస్య...

కొండ ప్రాంతాల్లో కలుషిత నీటి సమస్య తీవ్రంగా ఉందని ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రధానంగా గొల్లపాలెంగట్టును అనుకొని ఉన్న కొండ ప్రాంతాల్లో చాలాచోట్ల కలుషితనీరే సరఫరా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. కొండ ప్రాంతాల్లో గడిచిన రెండుమూడు నెలలుగా కలుషితనీరు సరఫరా అవుతున్న విషయంపై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోతుండటం గమనార్హం.

అలాగే కొత్తపేట కొండ ప్రాంతం, శ్రీనివాసమహల్ కొండపై భాగంతోపాటుగా నెహ్రూబొమ్మ సెంటర్ కొండ ప్రాంతం, బ్రాహ్మణవీధి కొండపై భాగం తదితర ప్రాంతాల్లోనూ కలుషితనీరు సరఫరా చేస్తుండటంతో తాగలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆందోళన చేసినా పట్టించుకునేవారేరీ?

కొండ ప్రాంతాల్లో నీటి సరఫరాలోనూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రధానంగా కొండ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా సమయాలు కుదించడంతోపాటుగా పూర్తిస్థాయిలో ప్రవాహం లేకపోవడంతో స్థానికంగా నీటిసమస్యలు తలెత్తుతున్నాయి. నీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని ఇటీవల పలుప్రాంతాల్లో ప్రజలు ధర్నాలు సైతం చేస్తున్నారు. ప్రధానంగా మల్లికార్జునపేట, కొత్తపేట, గొల్లపాలెంగట్టు, విద్యాధరపురం తదితర కొండ ప్రాంతాల ప్రజలకు నీరు అరకొరగా అందుతోంది. ఇటీవల పలు ప్రాంతాల్లో ఖాళీ బిందెలతో స్థానిక మహిళలు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు. ఇకనైనా నగరపాలకసంస్థ అధికారులు స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆయా కొండప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు కోరుతున్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి



కొండ ప్రాంతాల్లో కలుషితమైన నీరు సరఫరా అవుతోంది. పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. వారి సమస్యలను పట్టించుకోవడం లేదు. చాలా ప్రాంతాల్లో నీటిసరఫరా సరిగా లేకపోవడం, కలుషిత నీటిసరఫరా సమస్యలు ఉన్నాయి. నగరపాలకసంస్థ అధికారులు స్పందించి కొండప్రాంతాల్లోని ప్రజల మంచినీటి సమస్యను పరిష్కరించాలి.

– బోయి సత్యబాబు

ముసాఫిర్‌ఖానాను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే ఊరుకోం



పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విజయవాడ పాతబస్తీలోని వక్ఫ్ బోర్డుకు చెందిన ముసాఫిర్‌ఖానాను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు టెండర్లు పిలవటం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు పోతిన మహేష్ తెలిపారు. ముసాఫిర్‌ఖానాను కాంట్రాక్ట్‌కు ఇచ్చి కూటమి నేతలు కబ్జా చేయాలనుకుంటున్నారని ఆరోపించారు. పంజా సెంటర్‌లో ముసాఫిర్ ఖానాను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారని అందులో భాగంగా టెండర్లు పిలిచారని పేర్కొన్నారు. ముసాఫిర్‌ఖానాను అభివృద్ధి చేసిన తరువాత కార్పొరేషన్ అప్పగించేందుకే ఆ రోజున తాము పశ్చిమ నియోజకవర్గంలోని ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకించామని, పోరాడమని గుర్తు చేశారు. ముసాఫీరఖానా ఎదుట ఫుడ్ పార్క్ ఏర్పాటునే వ్యతిరేకించామని, కానీ నేడు ముసఫిర్‌ఖానాను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నాలు చేయడం దారుణమని పేర్కొన్నారు. ఏ విధంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడతారో ముస్లిం సమాజానికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ కేశినేని చిన్ని సమాధానం చెప్పాలన్నారు. పేద సామాన్య ముస్లిం కుటుంబాలకు కార్యక్రమాలు చేసుకునేటడానికి ఐదు వేలకు అద్దెకు ఇవ్వాలని అనేకసార్లు పోరాటం చేశామన్నారు. ఎవరి ఆమోదంతో, అనుమతితో టెండర్ నోటీసు పత్రికలో ఇచ్చారో అధికారులు ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న బుల్లి రాజు



భవానీపురం(విజయవాడపశ్చిమ): బాలనటుడు బుల్లి రాజు (సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్) బుధవారం కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నాడు. భీమవరం పట్టణానికి చెందిన బుల్లి రాజు తన తల్లిదండ్రులు శ్రీనివాసరావు, దేవితో కలిసి ఇంద్రకీలాద్రిపైకి విచ్చేశారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీకే శీనానాయక్‌ను కలువగా, ఆయన వారికి అమ్మవారి దర్శనం కల్పించి వేద పండితులతో ఆశీర్వచనం అందించారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా తాను మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటిస్తున్న చిత్రం విశేషాలను బుల్లి రాజు ముచ్చటించారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం



సిద్ధిబుద్ధి సమేత కల్యాణ గణపతిగా బాలగణపతి



స్వామి వారి కల్యాణోత్సవం చేస్తున్న అర్చకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలో కొలువై ఉన్న బాలగణపతి స్వామి వారు సిద్ధిబుద్ధి సమేత కల్యాణ గణపతిగా బుధవారం దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి ఆలయంలో జరుగుతున్న స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో వైదిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక సహస్ర నామార్చన కొనసాగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకోవటానికి తరలివచ్చారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

స్వామి వారికి శాంతి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉభయదేవేరులతో కూడిన స్వామి వారి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేశారు. గణపతి పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. యజ్ఞోపవీత ధారణ, కన్యాదానం, మంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ నిర్వహించారు. సామూహికంగా జరిగిన కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు నిర్వాహకులు అన్న సమారాధణ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీ వెంకటకృష్ణారావు, కోశాధికారి మండేపూడి వేణుగోపాలరావు పర్యవేక్షించారు. విశ్వహిందూ పరిషత్ ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ జనరల్ మిలింద్ పరాండే, గోకరాజు గంగరాజు, విజయడైరీ ఛైర్మన్ చలసాని అంజనేయులు, బీజేపీ నేత రాయుడు శ్రీనివాస్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

అలరించిన నాట్యప్రదర్శనలు

ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి నాట్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ సౌజన్యంతో ఈ ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులు వివిధ నాట్యాంశాలను ప్రదర్శించి అలరించారు. కార్యక్రమాలను కారుమూరి నాగవెంకటేశ్వరరావు, ఆత్మకూరి రామనరసింహరావు, ఆతుకూరి రాంబాబు, శ్రీదేవి, ఎంవీ సుధాకర్ తదితరులు పర్యవేక్షించారు.

కుమ్మర శాలివాహన సంఘం నూతన కార్యవర్గం



పాయకాపురం(విజయవాడరూరల్): ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం ఎన్టీఆర్ జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం కండ్రికలో జరిగింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఐలాపురం భాస్కర శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు, కార్యదర్శులుగా విలాసాగరపు రాంబాబు, బాడిశ భాస్కర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన ఏడు నియోజకవర్గాల సంఘం బాధ్యులుగా ఏడుగురుని కమిటీ సభ్యులుగా ఎనిమిది మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి శాలివాహన సంఘం పెద్దలు భర్తవరపు దుర్గాప్రసాద్ (బుల్లిబాబు), దేవగుప్తాపు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

తిరువూరు: అసంఘటిత కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో తిరువూరు మండల సీఐటీయూ మహాసభ బుధవారం జరిగింది. భవన కార్మికులకు లేబర్ కోడ్స్ రద్దుచేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పంచాయతీ కార్మికులకు రూ.15 వేల కనీస వేతనం ఇవ్వాలని శ్రీనివాస్ కోరారు. ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం కింద ఏడాదికి రూ.25 వేలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బిల్లులు విడుదల చేయాలని కోరారు. సీఐటీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇజ్రాయేలు, వెంకటేశ్వరరావు, సీపీఎం, ప్రజా నాట్యమండలి నాయకులు నాగేంద్రప్రసాద్, రవి, నాగమణి, తులసీరాణి పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో వ్యాధుల నుంచి రక్ష


డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



జక్కంపూడి కాలనీలో ఇమ్యునైజేషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు):ప్రాణాంతక వ్యాధులు సోకకుండా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె బుధవారం జక్కంపూడి కాలనీలోని నిర్వహిస్తున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం విశిష్టతను తెలియజేశారు. ప్రతి మహిళ గర్భం దాల్చిన మూడు నెలలలోపే తప్పని సరిగా టీటీ ఇంజక్షన్ తీసుకోవాలని, రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు వాడాలని సూచించారు. అదే క్రమంలో వైద్యులను సంప్రదిస్తూ వారి సూచనల మేరకు గర్భస్థకాలంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో మాత్రమే కాన్పు చేయించుకోవాలని సూచించారు. శిశువు జన్మించిన గంటలోపే బీసీజీ టీకా, పోలియో డ్రాప్స్ వేయించాలని, సంవత్సరం లోపు చేయించవలసిన అన్ని టీకాలను వేయించాలని డీఎంహెచ్‌ఓ చెప్పారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యానికి టీకాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీవేత్త కోకా విమలకుమారి మృతి



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త కోకా విమలకుమారి (82) బుధవారం మృతి చెందారు. ప్రభుత్వ వ్యాయామ అధ్యాపకురాలిగా ఆమె పనిచేశారు. 50 సంవత్సరాలుగా సాహితీసేవ చేస్తూ 20 పైగా పుస్తకాలను ప్రచురించారు.1988లో అప్పటి ముఖ్యమంత్రి చేతులమీదుగా ఉగాది పురస్కారం, 1995లో తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కవయిత్రి పురస్కారం 2000 సంవత్సరంలో ఢిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కళాపీఠం స్థాపించి సాహిత్యరంగంలో కృషి చేసిన మహిళలకు పురస్కారాలను అందజేశారు. ఎక్సరే సాహిత్యసేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి పదవితోపాటు నగరంలోని అనేక సాంస్కృతిక కళాసంస్థల అభివృద్ధికి కృషి చేశారు. ఆచార్య సి.నారాయణరెడ్డి, సినీ నటుడు తనికెళ్ల భరణి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. నగరానికి చెందిన నవ్యాంధ్ర రచయితల సంఘం (కలిమి), ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం (చలపాక ప్రకాష్), కృష్ణా జిల్లా రచయితల సంఘం (డాక్టర్ జి.వి.పూర్ణచందు), ఎక్సరే సాహిత్య సేవా సంస్థ (కొల్లూరి, బోడి ఆంజనేయరాజు), వేముల హజరత్తయ్య గుప్తా, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, నృత్య కళాకారిణి కోకా విజయలక్ష్మి తదితరులు విమలకుమారి మృతికి సంతాపం తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని పలు ఎరువుల దుకాణాలపై పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందులకు అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు, డీసీపీల పర్యవేక్షణలో ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో జిల్లాలోని ఎరువుల దుకాణాలు, ఎరువుల గోడౌన్లు, బోర్డర్ చెక్ పోస్టుల వద్ద పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో స్టాక్ నమోదు, పీఓఎస్ యంత్రాల్లో నమోదైన వివరాలు, పంపిణీ రిజిస్టర్లు, విక్రయ పత్రాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. జిల్లాలో యూరియా నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించి, అవి బ్లాక్ మార్కెట్‌కి వెళ్లకుండా అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. జిల్లాలో యూరియా అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్టు సీపీ రాజశేఖరబాబు తెలిపారు. ఈ తనిఖీలలో బాగంగా ఎ.కొండూరు, గంపలగూడెం తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలలోని అక్రమాలకు పాల్పడుతున్న వారిపై మూడు కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. అక్రమ నిల్వలు చేస్తే సహించేది లేదని సీపీ రాజశేఖరబాబు హెచ్చరించారు.

డాక్టర్ వరప్రసాద్‌కు ఐఆర్‌ఐఏ సత్కారం



డాక్టర్ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న మోహన్ ప్రసాద్, కులదీప్, రాజ్‌కుమార్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏషియన్ మస్క్యులో స్కెలేటల్ సొసైటీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నగరానికి చెందిన డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్‌ను బుధవారం ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్(ఐఆర్‌ఐఏ) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మహాత్మా గాంధీ రోడ్డులోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ మోహన్‌ప్రసాద్, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ చలసాని కులదీప్, విజయవాడ చాప్టర్ అధ్యక్షుడు బి.రాజ్‌కుమార్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌ప్రసాద్ మాట్లాడుతూ ఏషియన్ మస్క్యులో స్కెలేటల్ సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ వరప్రసాద్ నియామకం దేశానికే గర్వకారణం అన్నారు. రెండున్నర దశాబ్దాల కిందట ఏర్పాటైన ఈ సొసైటీకి ఇప్పటివరకూ భారతీయులు ఎవరూ అధ్యక్షుడిగా వ్యవహరించలేదని, తొలిసారిగా తెలుగు వాడైన డాక్టర్ వీఎస్ వరప్రసాద్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించడం మనందరికీ గర్వకారణం అన్నారు. గతంలో జాతీయ స్థాయిలో ఐఆర్‌ఐఏ, ఐసీఆర్‌ఐలకు అధ్యక్షులుగా వ్యవహరించి సమర్థమైన సేవలు అందించిన డాక్టర్ వరప్రసాద్ ఇప్పుడు ఆసియా ఖండానికి సేవలు అందించే అవకాశం దక్కిందన్నారు. ఈ సందర్భంగా పలువురు రేడియాలజిస్టులు అభినందనలు తెలిపారు.

ఆదాయపు పన్ను చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సూరజ్ రావు సాహెబ్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఆదాయపు పన్ను చెల్లింపులో ప్రభుత్వం కల్పించిన మినహాయింపుల గురించి చార్టర్డ్ అకౌంటెంట్(సీఏ)లకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని ఆదాయపు పన్ను శాఖ విజయవాడ సర్కిల్ (మినహాయింపుల విభాగం) డెప్యూటీ కమిషనర్ టి.సూరజ్‌రావు సాహెబ్ అన్నారు. ఆదాయపు పన్ను శాఖ మినహాయింపు విభాగంలో తాజాగా చేసిన సవరణలపై అవగాహన సదస్సు బుధవారం ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) భవన్‌లో జరిగింది. సూరజ్‌రావు సాహెబ్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను శాఖ పన్ను చెల్లింపులో కొన్ని సంస్థలకు మినహాయింపులు ఇస్తోందని, ఆ మినహాయింపుల్లో ప్రభుత్వం తాజాగా కొన్ని సవరణలు చేసిందన్నారు. ఆ సవరణల గురించి పూర్తి వివరాలు సీఏలు తెలుసుకోవాలన్నారు. ఆదాయపు పన్ను ప్రాముఖ్యత, రిటర్న్ దాఖలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రస్టుల ద్వారా రిటర్న్ దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనల గురించి ఆయన సీఏలకు అవగాహన కల్పించారు. ఇన్‌కమ్‌ట్యాక్స్ గుంటూరు సర్కిల్ మినహాయింపుల విభాగం అధికారి జి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. సదస్సు అనంతరం సీఏలు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ చైర్మన్ కంచమరెడ్డి నారాయణ, ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఉప్పలూరి జయంత్, కార్యదర్శి మనీష్‌కుమార్ జైన్, కోశాధికారి వి.వీరపవన్‌కుమార్, పలువురు సీఏలు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో చక్కటి ఆరోగ్యం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న సీఎంఎస్ డాక్టర్ ప్రసాద్ తదితరులు

రైల్వేస్టేషన్(విజయవాడసెంట్రల్):జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ డివిజన్ వ్యాప్తంగా పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం రైల్వే హాస్పిటల్‌లోని న్యూ ఓపీడీ భవన్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ ఎ.వి.ఎస్.కె ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు డివిజన్ వ్యాప్తంగా జాతీయ పోషకాహార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంచి ఆరోగ్యాన్ని పొందడంలో సరైన జీవనశైలి, అనారోగ్యాలను నివారించడంలో సమతుల్య పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఆహారపు అలవాట్లలో తగిన మార్పుల ద్వారా మధుమేహం, ఉభకాయం, రక్తపోటు తదితర వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. జాతీయ పోషకాహార వారోత్సావాల ద్వారాసమతుల్య ఆహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. సీనియర్ డైటీషియన్, న్యూట్రిషనిస్ట్ భోగాది శ్రీకళ మాట్లాడుతూ పిల్లలు, మహిళల ఆరోగ్యం కోసం పాటించాల్సిన ఆహార పద్ధతులను వివరించారు. అనంతరం రైల్వేస్టేషన్ పరిసరాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ సీఎంఎస్ డాక్టర్ ఎం.జేదీప్, వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేయాలి



ఆటో ర్యాలీ, మహాధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న దుర్గారావు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు డిమాండ్ చేశారు. దుర్గాపురం బీఆర్టీఎస్ రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే ఆటో ర్యాలీ, మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా దుర్గారావు పాల్గొని మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆటోకార్మికుల ఆదాయం స్త్రీ శక్తి పథకం వల్ల మరింత దిగజారిపోయిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన నేపథ్యంలో ఆటో, క్యాబ్ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని, వాహన మిత్ర ద్వారా సంవత్సరానికి రూ.25 వేల సాయం చేయాలని కోరారు. ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అనేక మంది, వ్యవసాయం లాభసాటి లేక యువత ప్రైవేట్ ఫైనాన్సర్లు, బ్యాంకుల వద్ద రుణాలు తీసుకుని ఆటోలు కొనుగోలు చేసి ప్రతినెలా కిస్తీలు చెల్లిస్తూ స్వయం ఉపాధితో కుటుంబాన్ని పోషించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు పది లక్షల మంది ఆటో డ్రైవర్లు స్వయం ఉపాధి పొందుతున్నారని, స్త్రీశక్తి పథకం వల్ల ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిందని పేర్కొన్నారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే దశల వారి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు బి.రూబెన్ కుమార్ ఎం.హనుమంతరావు, ఎస్‌డీ కరిముల్లా ఎస్‌కే దుర్గావలి, డి.కోటయ్య ఎం.సోమేశ్వరరావు జి.శ్రీనివాసరావు ఎ.వి.రెడ్డి, డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్

ఇబ్రహీంపట్నం: లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్ బాలురకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎ.చంద్రశేఖర్ బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. మండల పరిధిలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వచ్చే మైనర్లు లైసెన్సు, వాహన రికార్డులు లేకుండా 30వ నంబర్, 65వ నంబర్ జాతీయ రహదారులపై అతివేగంగా బైకులు నడపడాన్ని ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు పలుమార్లు గమనించారు. వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 ఏళ్లు నిండేవరకు కుటుంబ సభ్యుల బైక్‌లు తోలవద్దని సూచించారు. ప్రమాదాలు జరిగితే మీతోపాటు ఇతరులు కూడా నష్టపోతారని హెచ్చరించారు. తొలిసారిగా కౌన్సెలింగ్‌తో సరిపెట్టామని, మరోసారి పట్టుబడితే చట్టప్రకారం జరిమానా, జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ : 90102 10386
Office mail : sakshiads@gmail.com